# అభివృద్ధి బాధ్యత నాది

## నకిరేకల్‌లో బ్రహ్మాండమైన గెలుపునివ్వండి..

- బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును 100శాతం పూర్తి చేస్తాం
- ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలతో సాగు నీరు
- బస్వాపురం నుంచి కాళేశ్వరంతో రామన్నపేట కరువుకు విముక్తి
- నకిరేకల్ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

సూర్యాపేట, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ''నకిరేకల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను బ్రహ్మాండంగా గెలిపించండి మీకు ఏం కావాలో అవన్నీ చేసే బాధ్యత నేను తీసుకుంటా'' అని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. లింగయ్య ఏనాడూ తన సొంత పనుల కోసం తన వద్దకు రాలేదు... ఎప్పుడు వచ్చినా ఏదో ఒక అభివృద్ధి పని కోసం ఫైల్ పట్టుకొని వస్తాడని... ఆయన తపనంతా నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధి గురించే అని.. ఇలాంటి ఎమ్మెల్యే మీకు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం... ఈ సారి నకిరేకల్‌కు ఏదో ఒక లిఫ్ట్ కావాలని అడుగుతున్నాడు ఆయనను భారీ మెజారిటీతో గెలిపించి పంపండి.. ఏమి కావాలన్నా నాది బాధ్యత అంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. సోమవారం నకిరేకల్ మూసీ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్య అతిథిగా హాజరైన సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఈ జిల్లా వట్టికోట అల్వార్ స్వామి పుట్టిన గడ్డ, నర్రా రాఘవరెడ్డి లాంటి మహావీరులు ఉద్యమాలు చేసిన గడ్డ అని, బాగా చైతన్యమున్న ప్రాంతమని కితాబిచ్చారు. ''మీ అందరిని నేను ఒకటే కోరుతున్నా ఎన్నికలు వస్తుంటాయ్ పోతుంటాయ్.. 75సంవత్సరాల భారత దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎంత పరిణతి రావాలో అది ఇంకా రాలేదు. ఎన్నికలు వస్తే ఆగం కావద్దు ఆలోచన వివేచనతో ఓటేస్తే మనకు మంచి జరుగుతుంది. బీఆర్ఎస్ పుట్టిందే మీ కళ్ల ముందర తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ సాధించడం కోసం.. 15 సంవత్సరాలు పోరాటం చేసి అనేక మంది జైళ్ల పాలయ్యారు. నకిరేకల్‌కు చెందిన మిత్రుడు చెరుకు సుధాకర్ వంటి ఎంతో మంది శిక్షలు అనుభవించి పోరాడినం.'' అంటూ సీఎం గుర్తు చేశారు.

### బ్రాహ్మణ వెల్లెంల, పిల్లాయిపల్లి పూర్తి కావాలంటే లింగయ్య గెలువాలి

''ఇప్పటికే రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసుకొని ఆయా ప్రాంతాల్లో ధాన్యం పంట వంద నుంచి మూడు వందల శాతం పెరిగింది. నకిరేకల్ నియోజకవర్గంలో చేపట్టిన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువలు పూర్తి కావచ్చాయి... బ్రాహ్మణ వెల్లెంల ట్రయల్‌రన్ కూడా పూర్తయింది. నీళ్లు కూడా వచ్చాయియి. ఇవి వంద శాతం పూర్తి కావాలి. అలాగే ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువ పనులు కూడా పూర్తి అయితే దాని నుంచి కూడా నీళ్లు వస్తయి. ఇదంతా జరుగాలంటే మీకు ఎమ్మెల్యేగా లింగయ్య రావాలి కదా'' అని సీఎం కేసీఆర్ అన్నారు.

### కాళేశ్వరంతో రామన్నపేట కరువుకు విముక్తి

''కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి బస్వాపురం లింకు ద్వారా రామన్నపేట మండలానికి బ్రహ్మాండంగా నీళ్లు వస్తాయి. తద్వారా రామన్నపేట ప్రాంతం కరువు నుంచి విముక్తి లభిస్తుంది. ఇప్పటికే వందల కోట్లు తెచ్చి నకిరేకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.. నిధుల కోసం నా వద్దకు ఎలాంటి జంకూ లేకుండా వచ్చి మా ప్రజల కోసం అది కావాలి... ఇది కావాలని అని అడుగుతుంటడు. ఇలాంటి ఎమ్మెల్యే మీకు దొరకడం నిజంగా అదృష్టం'' అని సీఎం కేసీఆర్ చెప్పారు.

### నర్రా రాఘవరెడ్డిని గుర్తు చేస్తూ.. కమ్యూనిస్టులకు సూచన

''నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నర్రా రాఘవరెడ్డి ఎండిపోయిన వరి కంకులు తెచ్చి అసెంబ్లీలో చూపెడుతుండేది. కరెంట్ కోసం రోజూ కొట్లాడుతుండె. విజయవాడ రోడ్డు కూడా బంద్ పెడుతుండే. అలాంటి మహా నాయకున్ని కన్న గడ్డ ఇది.'' అని సీఎం కేసీఆర్ అన్నారు. ''కమ్యూనిస్టులను నేనే ఒకటే కోరుతున్న. మీ అభ్యర్థి కూడా లేడు. ఇక్కడ ఎవరికో ఓటేయకుండా అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్న చిరుమర్తి లింగయ్యకు మద్దతు ఇవ్వాలని నేను కోరుతున్నా'' అని సూచించారు.

### లింగయ్య వెంటే ప్రజాశక్తి ఉంది

''ఇవాళ నాకొకటి అర్థమైంది. ఈడ ఉన్న వాళ్లు కాకుండా చాలా మంది బయట ఉన్నరు. ఈ సభతో లింగయ్య గెలిచిండని అర్థమైంది. దాన్ని ఎవరూ ఆపలేరు. ప్రజాశక్తి ముందు ఎవరూ ఏం చేయలేరు. లింగయ్య నన్ను వాళ్లు తిడుతున్నరు, వీళ్లు తిడుతున్నరు అంటున్నావు... తిట్టుకోనియ్యి... నీవు ప్రజల కోసం ఎప్పుడు పడే తపన వీడకు... నీకు చెబుతున్నా ఇంత పెద్ద ప్రజాశక్తి నీ వెంట ఉంది.. ఎవడు ఏం అనుకుంటే నీకేంది.'' అంటూ సీఎం కేసీఆర్ చిరుమర్తి లింగయ్య భుజం తట్టారు. ''తప్పకుండా గెలుపు నీదే. బ్రహ్మాండమైన విజయం మనం సాధించబోతున్నాం. అందులో ఎలాంటి సందేహం లేదు. నకిరేకల్ నియోజకవర్గానికి నేను ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటాను. అలాగే లింగయ్య ఏ నాడు వ్యక్తిగత పనులు అడగలేదు, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు, అయిటిపాముల ఎత్తి పోతలు, ఆస్పత్రులు, రోడ్ల గురించి అడిగిండు తప్ప ఇంకోటి అడగలేదు. మంచి వ్యక్తి..ఆయనను బ్రహ్మాండంగా గెలిపించండి. మీకు అనుకున్న పనులు నేను చేస్తాను. మంది మాటలు పట్టుకొని మరు మనం పోతే మల్లొచ్చేసరికి ఇల్లు కాలిపోయిందన్న చందంగా ఎవరో చెబితే ఓటు వేయొద్దు... ఆలోచించి అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌ను ఆదరించి చిరుమర్తి లింగయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి.'' అని సీఎం కేసీఆర్ ప్రజలను కోరారు.

## ఇది ధర్మానికి.. అధర్మానికి మధ్య యుద్ధం

- కాంగ్రెస్ నాయకుల అహంకారపు మాటలు ప్రజలు గమనిస్తున్నరు
- ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, నవంబర్ 20 : ఈ నెల 30న ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధంలో ధర్మాన్ని గెలిపించేందుకు ఆశీర్వాద సభకు విచ్చేసిన నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనాలు చేస్తున్నానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు దత్తత తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను ఆయన కోరారు. సోమవారం నకిరేకల్ పట్టణంలోని మూసీరోడ్డులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే భావోద్వేగ ప్రసంగం చేశారు. ఒక దళిత బిడ్డనైన తనపై కాంగ్రెస్ నాయకులు అవాక్కులు, చవాక్కులు పేలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి మారింది ఎందుకో ప్రజలకు తెలుసన్నారు. ఆనాటి పరిస్థితులను బట్టి, అరాచకాలకు చెక్ పెట్టాలని, నియోజకవర్గ ప్రశాంతత కోసం, నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు తాను ఆయన వెంట వెళ్లినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గానికి కోట్ల రూపాయాలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. రూ.200 కోట్లతో ఉదయసముద్ర ప్రాజెక్టు, రూ.100 కోట్లతో అయిటిపాముల ఎత్తిపోతల ప్రాజెక్టు, రూ.32 కోట్లతో నకిరేకల్ వంద పడకల ఆస్పత్రి పనులు చేస్తున్నామని, నకిరేకల్ మున్సిపాలిటీని రూ.135 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.50 కోట్లతో చిట్యాల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో చేస్తున్నామన్నారు. రామన్నపేట నుంచి మొదలుకొని కేతేపల్లి వరకు అన్ని గ్రామాల్లో కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, హెల్త్ సెంటర్లు, రైతు వేదికలు నిర్మించినట్లు చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంతమంది కాంగ్రెస్ నాయకులు ''వీరేశం ఎమ్మెల్యే అయితే బీఆర్ఎస్ శ్రేణులను రామన్నపేట నుంచి కేతేపల్లి వరకు తొక్కుకుంటూ వెళ్తాం'' అంటూ అహంకార పూరితంగా మాట్లాడిన మాటలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం తప్పా? ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం తప్పా? నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను పరిష్కరించడం తప్పా? అని ప్రశ్నించారు. తనను చంపుతానంటూ కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రజలే తన బలగం, సర్వం, శక్తి అన్నారు. రాజకీయంలోకి సేవ చేసేందుకు వచ్చానన్నారు. అటు హైదరాబాద్‌కు, ఇటు గుంటూరు, విజయవాడకు సెంటర్‌గా ఉన్న నకిరేకల్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఉదయ సముద్రం పెండింగ్ పనులు పూర్తిచేయాలని, చిట్యాలలో బైపాస్‌తో పాటు అండర్‌పాస్, అయిటిపాముల లిఫ్ట్ పనులు త్వరితగిన పూర్తిచేయాలని సీఎంను కోరారు. నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను దీవించి భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుక అందించాలని కోరారు. సభలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, సాధినేని వెంకటేశ్వరావు, గుత్తా అమిత్‌రెడ్డి, నలగాటి ప్రసన్నరాజ్, చింతల సోమన్న, చెరుకు లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్ట మల్లికార్జున్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎంపీపీలు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కొలను సునీత, కన్నెబోయిన జ్యోతి, జడ్పీటీసీ మాద ధనలక్ష్మి, బొప్పని స్వర్ణలత, తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్లు పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నూక సైదులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ప్రగడపు నవీన్ రావు, ఊట్కూరి ఏడుకొండలు, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఆవుల అయిలయ్య మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణీకృష్ణమూర్తి, నాయకులు చేపూరి రవీందర్, కొండ జానయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

### సభను విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్‌లో సీఎం కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కృతజ్ఞతలు తెలిపారు. నకిరేకల్ పట్టణంతో అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, రైతులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# కిక్కిరిసిన నకిరేకల్

- ప్రజా ఆశీర్వాద సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిన సీఎం కేసీఆర్ ప్రసంగం


ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలివస్తున్న ప్రజలు

కట్టంగూర్, నవంబర్ 20 : నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు, గులాబీ శ్రేణులు తరలిరావడంతో నకిరేకల్ పట్టణమంతా గులాబీ మయమైంది. మదినిండా అభిమానంతో లక్షలాదిగా ప్రజలు సభకు తరలివచ్చారు. మూసీ రోడ్డు సమీపంలో 15 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం జనంతో నిండిపోయింది. తమ అభిమాన నేత సీఎం కేసీఆర్‌ను చూడడానికి, ఆయన ప్రసంగం వినడానికి దండుగా కదిలివచ్చారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నంతసేపు ఓపికగా విన్న ప్రజలు ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు. 24 గంటల కరెంట్, రైతుబంధు, ధరణి కావాలా.. వద్దా అంటూ సీఎం కేసీఆర్ ప్రశ్నించగానే కావాలి అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. ధరణి కావాలంటే ఎవరికి ఓటు వేయాలని సీఎం అడిగితే బీఆర్ఎస్‌కే అంటూ పెద్ద ఎత్తున స్పందించారు. చిరుమర్తి లింగయ్య ప్రజల్లో ఉండే మనిషి మీరు ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఉరుకొచ్చే వ్యక్తి.. లింగయ్యను బ్రహ్మాండంగా గెలిపించండి మీ పనులన్నీ చేసే బాధ్యత నాది అనగానే సభ చప్పట్లు, ఈలలతో మారుమోగింది. ఇయాల నాకో విషయం అర్థమైంది హెలికాప్టర్ దిగుతుంటే నేనే చూసిన ఇక్కడ ఉన్న మంది కాక అనేక మంది రోడ్లమీద ఉన్నరు గ్యారంటీ ఈ సభతో లింగయ్య గెలిచిపోయిండని తెలిసిపోయింది అని సీఎం కేసీఆర్ అనగానే ప్రజలు జై లింగన్న అంటూ నినాదాలు చేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో కళాకారులు ఆట పాటలతో అలరించారు. గాయకురాలు మధుప్రియ కళా బృందం తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాలను ఆట పాటలతో వివరించారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కళాకారుల ఆటపాటలు ప్రజలు ఉత్తేజ పర్చాయి.

### సీఎం సభ సైడ్ లైట్స్

- ఉదయం 11 గంటల నుంచే ప్రజలు సభాప్రాంగణానికి రావడం ప్రారంభమైంది.
- మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు భారీగా తరలివచ్చారు.
- సభా వేదికపై ఉన్న ఉద్యమనేత చెరుకు సుధాకర్‌ను సీఎం కేసీఆర్ ఆప్యాయంగా పలుకరించారు.
- ప్రజా ఆశీర్వాద సభకు సుమారు 70 వేల మంది హాజరయ్యారు.
- మధ్యాహ్నం 3.45 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ నకిరేకల్‌కు చేరుకుంది.
- 3.50 గంటలకు ప్రత్యేక బస్సులో సీఎం కేసీఆర్ సభా ప్రాంగణానికి బయల్దేరి 4 గంటలకు చేరుకున్నారు.
- 4.08 గంటలకు సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించి 4.32 గంటలకు ముగించారు.
- సాయంత్రం 4.35 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్ అక్కడి నుంచి నల్లగొండకు బయల్దేరి వెళ్లారు.